సాక్షి
మంచిర్యాల

గురువారం । 20 । ఏప్రిల్ । 2023



రహదారి అలజడి
రాయపట్నం నుంచి క్యాతనపల్లి వరకు ఫోర్ లేన్ నిర్మాణానికి త్వరలో భూసేకరణ చేపట్టనున్నారు. గుడిపేటవాసులు మరోసారి నిర్వాసితులుగా మారనున్నారు. 8లో▸

మంచిర్యాల జిల్లా జడ్జి బదిలీ
మంచిర్యాలక్రైం: మంచిర్యాల జిల్లా మొదటి అదనపు జిల్లా సెషన్స్ జడ్జి జే.మైత్రేయి బుధవారం బదిలీ అయ్యారు. హైదరాబాద్ సీబీఐ కోర్టు మొదటి అడిషనల్ స్పెషల్ కోర్టుకు బదిలీ కాగా ఆమె స్థానంలో ఎవరినీ నియమించలేదు.

వాతావరణం
గరిష్టం/కనిష్టం
42.0 /27.0

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. సాయంత్రం మేఘావృతమై ఉంటుంది. వాయువ్యం దిశగా వడగాలులు వీస్తాయి.

బూస్టర్ డోస్



- కరోనాను ఎదుర్కొనేందుకు సన్నద్ధం
- నేటి నుంచి వ్యాక్సినేషన్
- జిల్లాలో పెరుగుతున్న పాజిటివ్ కేసులు
- కోవిడ్ పరీక్షలు పెంపు



పాతమంచిర్యాల యూపీహెచ్‌సీలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి అనిత

మంచిర్యాలటౌన్: కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య పెరుగుతుండడంతో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల హెచ్చరికల నేపథ్యంలో ఇటీవలే ఆస్పత్రుల్లో కోవిడ్ చికిత్స, సదుపాయాలపై మాక్‌డ్రిల్ నిర్వహించింది. ఎన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు, పడకలు, ఐసీయూ బెడ్‌లు, ఆక్సిజన్ సిలిండర్లు అందుబాటులో ఉన్నాయనే వివరాలను రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖకు నివేదించింది. రాష్ట్రంలో రోజు రోజుకు కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య పెరుగుతుండడంతో బూస్టర్ డోస్, ప్రికాషనరీ డోస్ వ్యాక్సిన్ వేసేలా జిల్లా వైద్యారోగ్య శాఖకు సూచించింది. ఈ మేరకు జిల్లాకు అవసరమైన వ్యాక్సిన్ బుధవారం తెప్పించగా.. గురువారం నుంచి జిల్లాలోని 17 ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, నాలుగు అర్బన్ హెల్త్‌సెంటర్లు, మూడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో టీకాలు వేసేందుకు ఏర్పాట్లు చేస్తోంది. గతంలో మాదిరిగానే నిబంధనలు పాటిస్తూ ఉదయం తొమ్మిది గంటల నుంచి వ్యాక్సిన్ వేసేలా చర్యలు తీసుకుంటున్నారు. కోవిషీల్డ్, కోవాగ్జిన్ రెండో డోసులు పూర్తి చేసుకుని బూస్టర్ డోస్ వేసుకోని వారు జిల్లాలో 2,50,449 మంది ఉండగా, 12 నుంచి 14ఏళ్లలోపు పిల్లలు మొదటి డోస్ వేసుకుని రెండో డోస్ వేసుకోని వారు 4,817 మంది ఉన్నారని గుర్తించారు. ప్రభుత్వం ఏడు వేల డోసుల కార్బేవ్యాక్స్ కరోనా వ్యాక్సిన్ జిల్లాకు పంపిస్తున్నారు. మూడో డోసు వేసుకోని వారికి గతంలో ఏ వ్యాక్సిన్ వేసుకున్నా ప్రస్తుతం కార్బేవ్యాక్స్ వ్యాక్సిన్ వేయనున్నారు. 12నుంచి 14ఏళ్లలోపు పిల్లలకు గతంలో మొదటి డోసు ఇచ్చి రెండో డోసు వేసుకోని వారికీ రెండో డోసుగా ఇవ్వనున్నారు.

పెరుగుతున్న కరోనా కేసులు
జిల్లాలో కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య పెరుగుతుండడంతో అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో పరీక్షలు ప్రారంభించారు. ఈ నెలలో కోవిడ్ ర్యాపిడ్ టెస్టులు 895 మందికి చేయగా, 13 మందికి పాజిటివ్‌గా వచ్చింది. 310 మందికి ఆర్టీపీసీఆర్ పరీక్షలు చేయగా 10 మందికి పాజిటివ్ నమోదైంది. 19 రోజుల్లోనే 23 మందికి కరోనా పాజిటివ్ నిర్ధారణ కావడం, ఇందులో సగం కేసులు బెల్లంపల్లి ప్రాంతంలోనే నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది. చిన్నపాటి జ్వరం, దగ్గు, జలుబు ఉన్నవారు మెడికల్ షాపుల్లోని మందులు వేసుకోవడం, ఆస్పత్రికి వెళ్లకపోవడం వల్ల కరోనా వ్యాపిస్తోంది. మాస్కులు ధరించాలని, గుంపులుగా ఉండే చోటకు వెళ్లవద్దని వైద్యులు చెబుతున్నా, కరోనా నిబంధనలు పాటించకపోవడంతో కరోనా బారిన పడుతున్నారు. గతంలో మాదిరిగా కరోనా తీవ్రత లేకపోవడం, సాధారణ జ్వరం మాదిరిగానే వస్తుండడంతో ప్రజల్లో భయం లేకుండా పోయిందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. కరోనా వ్యాక్సిన్ వేసుకోవడం వల్ల ప్రజల్లో పెరిగిన రోగ నిరోధక శక్తి వల్లనే వైరస్ ప్రభావం అంతగా లేదని, ప్రస్తుతం వేసే ప్రికాషనరీ డోసు వ్యాక్సిన్‌ను వేసుకుంటే మరింతగా కరోనా నుంచి రక్షణ లభిస్తుందని వైద్యులు చెబుతున్నారు.

జిల్లాలో కోవిడ్ చికిత్స వివరాలు

ఆస్పత్రులు	144
పడకలు	1,484
ఐసోలేషన్ బెడ్‌లు	458
ఆక్సిజన్ బెడ్‌లు	318
ఐసీయూ బెడ్‌లు	321
వెంటిలేటర్లు	47
అల్లోపతి వైద్యులు	194
ఆయూష్ వైద్యులు	43
నర్సులు	451
పారామెడికల్ స్టాఫ్	477
అంబులెన్సులు	30
పీఎస్‌ఏ ప్లాంట్లు	2

వ్యాక్సినేషన్ వివరాలు

రెండు డోసు వేసుకోవాల్సింది	5,53,103
బూస్టర్ డోసు వేసుకున్న వారు	3,02,654
వేసుకోవాల్సిన వారు	2,50,449
12-14 ఏళ్ల వారిలో రెండోడోసు డ్యూ	4,817

జాగ్రత్తలు తీసుకోవాలి



జిల్లాలో గురువారం నుంచి అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రికాషనరీ డోస్ కోవిడ్ వ్యాక్సిన్ వేస్తాం. ఇందుకోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. రెండు డోసులు పూర్తి చేసుకుని, బూస్టర్ డోస్ వేసుకోని వారు, 12–14 ఏళ్ల చిన్నారుల్లో మొదటి డోసు వేసుకుని, రెండవ డోసును వేసుకోని వారికి వ్యాక్సిన్ వేస్తాం. కోవిషీల్డు, కోవాగ్జిన్‌లలో ఏ వ్యాక్సిన్‌ను వేసుకున్నా, వారికి కార్బేవ్యాక్స్ వ్యాక్సిన్‌ను ప్రికాషనరీ డోస్‌గా వేస్తాం. కరోనా పాజిటివ్ కేసులు పెరిగితే చికిత్స అందించేలా ఏర్పాట్లు చేశాం. ప్రజలు అప్రమత్తంగా ఉండి కరోనా రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి.

– డాక్టర్ సుబ్బరాయుడు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి

ఎట్టకేలకు ధాన్యం సేకరణ




హాజీపూర్ మండలంలో కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న కలెక్టర్ సంతోష్, ఎమ్మెల్యే దివాకర్‌రావు

- 11 కొనుగోలు కేంద్రాలు ప్రారంభం
- సమస్యల పరిష్కారానికి కంట్రోల్ రూం

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో ఎట్టకేలకు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి ధాన్యం సేకరిస్తున్నారు. బుధవారం కలెక్టర్ బాదావత్ సంతోష్, మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. హాజీపూర్ మండలంలో 2, లక్సెట్టిపేట మండలంలో 6 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. జిల్లాలో 2,28,662 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం కాగా, పీఏసీఎస్ 119, డీసీఎంఎస్ 71, డీఆర్‌డీఏ 54 కొనుగోలు కేంద్రాలు మొత్తంగా 244 ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. మరో ఐదు కేంద్రాలు పెంచే అవకాశం ఉంది. 57,16,550 గన్నీ సంచులు అవసరం కాగా 18,08,491 గన్నీ సంచులు అందుబాటులో ఉన్నాయి. ఇప్పటివరకు పీఏసీఎస్ 8, డీసీఎమ్మెస్ 3 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. వరికోతలకు అనుగుణంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. దిగుబడి వచ్చిన పంటలో 95 శాతం సాధారణ దొడ్డు రకం ధాన్యమే కేంద్రాలకు రానుంది.

లక్ష్యం 2.28 లక్షల మెట్రిక్ టన్నులు
జిల్లాలో ఈ ఏడాది 94,200 ఎకరాల్లో వరి సాగు చేశారు. 2.50లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. ఇందులో 22వేల మెట్రిక్ టన్నుల వరకు సన్నరకం ధాన్యం కంపెనీల ఒప్పందం, రైతులు తినడానికి నిల్వ చేసుకోగా.. 2.28లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని లక్ష్యంగా పెట్టుకున్నారు. సేకరించిన ధాన్యం జిల్లాలోని 34 రా రైస్‌మిల్లులకు 66,500 మెట్రిక్ టన్నులు, మరో 21 బాయిల్డ్ రైస్‌మిల్లులకు లక్షా 24 వేల మెట్రిక్ టన్నులు కేటాయించారు. మిల్లులకు ధాన్యం తరలించేందుకు రవాణా కాంట్రాక్టర్ మూడు సెక్టర్లుగా విభజించి కేంద్రాలకు లారీలు పంపించనున్నారు. గన్నీ సంచులు, ట్రాక్‌షీట్, ట్యాబ్స్, టార్పాలిన్, తూకం కాంటాలు, రవాణాకు లారీలు సమకూర్చనున్నారు. కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు నీడ, తాగునీరు సౌకర్యం కల్పించడంతోపాటు భౌతిక దూరం పాటించేలా చూడాలని అధికారులు నిర్వాహకులకు సూచిస్తున్నారు. రైతుల సమస్యల పరి ష్కారానికి కంట్రోల్ రూం(నంబరు 63039 28682) ఏర్పాటు చేశారు.

కేంద్రాల ఏర్పాటులో తర్జనభర్జన
జిల్లాలో గత ఏడాది 240 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించగా.. 228 కేంద్రాల్లోనే పూర్తి స్థాయిలో ధాన్యం సేకరించారు. ఈ ఏడాది సాగు విస్తీర్ణం పెరగడంతో దిగుబడి భారీగానే ఉంటుందనే లక్ష్యంతో కొనుగోలు కేంద్రాల పెంపునకు అధికారులు నిర్ణయించారు. 244 కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు సిద్ధమయ్యారు. గత కొద్ది రోజులుగా కొనుగోలు కేంద్రాల ఖరారులో అధికారులు తర్జనభర్జన పడుతున్నారు. జిల్లాలోని ప్రజాప్రతినిధుల నుంచి వస్తున్న ఒత్తిడితో అధికారులు తల పట్టుకుంటున్నారు.



ఇఫ్తార్ గురు : 6:34
సహర్ శుక్ర: 4:30

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

ప్రగతి నివేదిక రూపొందించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ బాదావత్ సంతోష్

మంచిర్యాలఅగ్రికల్చర్: అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ప్రగతి నివేదికలు రూపొందించాలని కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్, ముఖ్య ప్రణాళిక అధికారి జి.సత్యంతో కలిసి జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో నివేదిక రూపకల్పనపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ 2014–15 నుంచి 2022–23 వరకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని, ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో సాధించిన ప్రగతిని తెలియజేసేందుకు వారం రోజుల్లో నివేదిక రూపొందించాలని తెలిపారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా నివేదికల రూపకల్పనపై అధికారులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజన్, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

పగలు భగ భగ..
- రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- గరిష్ట ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల చేరువకు



చున్ని తలపై కప్పుకొని వెళ్తున్న యువతులు

మంచిర్యాలఅగ్రికల్చర్: మంచిర్యాల జిల్లాలో సూరీడు నిప్పులు కురిపిస్తున్నాడు. గరిష్ట ఉష్ణోగ్రతలు పెరుగుతూ వస్తున్నాయి. గత రెండు రోజులుగా గరిష్ట ఉష్ణోగ్రతలతోపాటు కనిష్ట ఉష్ణోగ్రతలూ పెరుగుతున్నాయి. పగలు భానుడు భగభగ మండుతుండగా.. రాత్రి ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోతున్నారు. మంగళవారం గరిష్ట ఉష్ణోగ్రత 43.8 డిగ్రీలు నమోదు కాగా బుధవారం గరిష్ట ఉష్ణోగ్రత 44.3 డిగ్రీలకు, కనిష్ట ఉష్ణోగ్రత 27.9 డిగ్రీలకు చేరింది. రానున్న రెండు రోజులు ఆరెంజ్ జోన్ నుంచి రెడ్ జోన్‌లోకి ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ నిపుణులు సూచిస్తున్నారు.

మానని గాయం

- ఇంద్రవెల్లి ఘటనకు 42 ఏళ్లు
- నేడు అమరవీరుల సంస్మరణ దినోత్సవం
- ఉమ్మడి జిల్లా నుంచి తరలిరానున్న ఆదివాసీలు
- హాజరుకానున్న ఎంపీ సోయం, ములుగు ఎమ్మెల్యే సీతక్క, వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు షర్మిల



అమర వీరుల స్తూపం వద్ద సంస్మరణ దినోత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేసిన ఆదివాసీలు

సాక్షి ఆదిలాబాద్ /ఇంద్రవెల్లి: 1981 ఏప్రిల్ 20... జల్.. జంగల్.. జమీన్ కోసం ఉద్యమించిన అడవిబిడ్డలపై అప్పటి సర్కారు తుపాకీ ఎక్కుపెట్టింది. తూటాల వర్షం కురిపించింది. హక్కుల సాధనలో 13 మంది (అధికారికంగా) గిరిజనులు అమరులయ్యారు. వారి రక్త పుటేరులతో తడిసిన వనసీమ ఎర్రబారింది. అడవిబిడ్డల అమరత్వం నింగికెగిసిన అగ్నిశిఖలా ఇంద్రవెల్లిలో అమరుల స్తూపమై నిలిచింది. ఈ ఘటనకు 42 ఏళ్లు. అయితే అమరుల సంస్మరణ దినంను అధికారికంగా నిర్వహించాలని ఆదివాసీ నాయకులు ఏటా వినతులు సమర్పిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. కేవలం రెండు గంటలు మాత్రమే బందోబస్తు నడుమ అనుమతిస్తున్నారు. ఈ సారి కూడా అదే పరిస్థితి. ఈ నేపథ్యంలో నేటి కార్యక్రమానికి ఉమ్మడి జిల్లా నుంచి ఆదివాసీలతో పాటు ఎంపీ సోయం బాపూరావ్, ములుగు ఎమ్మెల్యే సీతక్క, వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు షర్మిల హాజరుకానున్నారు. ఇప్పటికే స్తూపం వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

నా భర్తను కోల్పోయిన..



నాటి ఘటనలో నా భర్త కొద్దు మరణించాడు. తరువాత చాలా కష్టాలు పడ్డా. కూలి పనులు చేసుకుంటూ కొడుకు మోహపత్‌రావ్‌ను పెంచిన. కానీ ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం అందలేదు. ఇప్పటికైనా స్పందించి ఆర్థికసాయంతో పాటు డబుల్ బెడ్ రూమ్ మంజూరు చేసి ఆదుకోవాలి.


– సేడ్మాకి లచ్చుబాయి, తాటిగూడ

కుడిచేతికి తూటా గాయమైంది..



నాడు పోలీసుల కాల్పుల్లో నా కుడిచేతికి తూటా గాయమైంది. ఆ కారణంగా ఇప్పటికీ ఏ పని చేయలేకపోతున్న. ఆ సంఘటన తరువాత నా భర్త శంభు అనారోగ్యంతో చనిపోయిండు. ఉన్న ఒక్కగానొక్క కొడుకు జంగు కూడా అనారోగ్యంతోనే ఈ లోకం విడిచి పోయిండు. కోడలు యేత్మబాయి వద్ద ఉంటూ కాలం వెళ్లదీస్తున్నా. నడవలేక పోతున్నా. నా కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి.

– మడావి జంగుబాయి, కన్నాపూర్



స్తూపం వద్ద ఏర్పాటు చేసిన శిలాఫలకం

నాటి అమరులు వీరే..
నాడు పోలీసుల కాల్పుల ఘటనలో గాయాలతో వెళ్లి తమ తమ గ్రామాల్లో సుమారు 60 మంది వరకు చనిపోయినట్లు నాటి తరం వారు చెబుతున్నారు. ప్రస్తుతం ఆదివాసీ సంఘాల సర్వే ప్రకారం 20 మంది అమరుల వివరాలు సేకరించారు. ప్రభుత్వం మాత్రం కేవలం 13 మంది మాత్రమే అమరులైనట్లు ప్రకటించింది.

ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని పిట్టబొంగరం గ్రామానికి చెందిన మడావి రాము, కోట్నాక్ గాఙ్రు, మండాడి జంగు, ఎర్మ దేవ్‌రావ్, వెట్టి ఇస్రుబాయి, వడగామ్ గ్రామానికి చెందిన కనక సోము, కోయల్‌పాండ్రి గ్రామానికి చెందిన సెడ్మకి కొద్దు, జోర్‌పల్లి గ్రామానికి చెందిన తొడసం భీంరావ్, కన్నాపూర్ గ్రామానికి చెందిన కుమురం కొద్దు, నిజాంగూడ గ్రామానికి చెందిన పెందోర్ దేవ్‌రావ్, జాకిట్‌గూడ గ్రామానికి చెందిన డోంగురావ్, ఎగోతిరావ్ ఉన్నారు. అలాగే గౌరపూర్ గ్రామానికి చెందిన ముత్తు, డోంగర్‌గాం గ్రామానికి చెందిన కోవ రాము, బోరుజ్‌గూడ గ్రామానికి చెందిన హెరేకుమ్ర జంగు, మోహన్‌గూడ గ్రామానికి చెందిన ఆర్క గంగు, బంగారుగూడ గ్రామానికి చెందిన సిడాం బాపురావ్, మామిడిగూడ గ్రామానికి చెందిన మెస్రం సురేష్, ఇచ్చోడ మండలం సోన్‌పల్లి గ్రామానికి చెందిన పెందోర్ బండు, సిరికొండ మండలం పొండుగూడకు చెందిన పెందోర్ గంగులు ఉన్నారు. వీరే కాకుండా మరికొందరు గాయాలతో ఇళ్లకు వెళ్లి అమరులయ్యారని ఆదివాసీ నాయకులు చెబుతున్నారు.

మృత్యుంజయులుగా ..
ఆ పర్వతాలు ఎరుపు.. అక్కడి పువ్వులు ఎరుపు.. వారి మరణం ఎరుపు.. మా నివాళి ఎరుపే.. ఇంద్రవెల్లి అమరవీరుల స్తూపంపై మనకు ఈ అక్షరాలు కనిపిస్తాయి. తమ హక్కుల కోసం ఆ నాడు ఉద్యమించి వీరమరణం పొందిన వారిని ఆదివాసీలు ప్రజావీరులుగా.. మృత్యుంజయులుగా భావిస్తూ ఏటా స్మరించుకుంటారు. మరోసారి ఆదివాసీ గిరిజనులు ఇంద్రవెల్లి అమరవీరుల సంస్మరణానికి సిద్ధమయ్యారు. ఇదిలా ఉంటే గతంలో యూపీఏ ప్రభుత్వ హయాంలో ఇంద్రవెల్లి స్మారక స్తూపం స్థలాన్ని జలియన్ వాలా బాగ్ తరహాలో అభివృద్ధి చేస్తామని చెప్పినప్పటికీ ముందడుగు పడలేదు. ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వాలు కూడా ఆ దిశగా చర్యలు చేపట్టలేదు.

ఆ రోజు ఏం జరిగిందంటే..
అది 1981 ఏప్రిల్ 20. నాడు జల్.. జంగల్.. జమీన్.. నినాదంతో పాటు అటవీ అధికారులు, షావుకార్ల దౌర్జన్యం నశించాలనే డిమాండ్‌తో గిరిజన రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో ఇంద్రవెల్లిలో సభ ఏర్పాటు చేశారు. దీనికి పీపుల్స్‌వార్ మద్దతునిచ్చింది. అప్పట్లో ప్రభుత్వం సభ నిర్వహణకు అనుమతినిచ్చినట్టే ఇచ్చి ఆ తర్వాత రద్దు చేసింది. విషయం తెలియక ఆదివాసీ గూడాల నుంచి పెద్ద ఎత్తున సభకు తరలివచ్చారు. సభ స్థలాన్ని ఖాళీ చేయాలని పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు. ఈ క్రమంలో ఆదివాసీలు, పోలీసుల మధ్య తోపులాట చోటు చేసుకుంది. ఈ దశలో పోలీసులు కాల్పులు జరపడంతో పలువురు ఆదివాసీలు మృతి చెందారు.

ఇప్పటికీ అవే డిమాండ్లతో పోరాటం..
ఏజెన్సీ ప్రాంతాల్లో నేటికీ జల్ జంగల్ జమీన్ పోరాటాలు కొనసాగుతున్నాయి. 1/70 చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఆదివాసీలు డిమాండ్ చేస్తున్నారు. లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని కోరుతున్నారు. ఇప్పుడప్పుడు పంపిణీ చేస్తామని చెబుతూ దాటవేస్తున్న పోడు పట్టాల అంశంపై ఆదివాసీలు మండిపడుతున్నారు. గత జనవరిలో నాగోబా జాతర సందర్భంగా ఇంద్రవెల్లి మండలానికి వచ్చిన రాష్ట్ర గిరిజన శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ త్వరలోనే పోడు పట్టాల పంపిణీ ప్రారంభిస్తామని చెప్పినప్పటికీ ఇప్పటికీ దానిపై కదలిక లేకపోవడం పట్ల ఆదివాసీలు మండిపడుతున్నారు.

స్తూపాన్ని అభివృద్ధి చేయాలి



అమరవీరుల స్తూపం అభివృద్ధిపై ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయి. నాటి కేంద్రమంత్రి జైరాం రమేశ్‌తో పాటు రాష్ట్ర మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు స్తూపాన్ని సందర్శించిన సమయంలో అభివృద్ధి చేస్తామని హామీలిచ్చి మరిచారు. దీంతో ఏటా ఆంక్షల నడుమ అమరులకు నివాళులర్పించాల్సిన పరిస్థితి.

– పుర్క బాపూరావ్, తుడుందెబ్బ ఆదిలాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి

అమరుల కుటుంబాలను ఆదుకోవాలి



స్తూపాన్ని అభివృద్ధి చేయడంతో పాటు అమరవీరుల కుటుంబాలను ఆదుకోవాలి. కుటుంబ పెద్దలను కోల్పోయిన అనేక కుటుంబాలు పోషణకు ఇబ్బందులకు గురయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి బాధిత కుటుంబాలకు డబుల్ బెడ్ రూమ్ మంజూరు చేసి ఆదుకోవాలి.

– ఆర్క ఖమ్ము(ఆదివాసీ నాయకుడు)

రెండోసారి స్మారక స్తూపం..
నాటి పోలీసు కాల్పుల్లో అమరులైన ఆదివాసీల స్మారకార్థం నాడు రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో 80 అడుగుల స్తూపాన్ని నిర్మించారు. అయితే ఆ స్తూపాన్ని 1986 మార్చిలో గుర్తు తెలియని వ్యక్తులు డైనమేట్లతో పేల్చారు. దీంతో గిరిజనులు ఆందోళన చేయడంతో 1987లో ప్రభుత్వం ఐటీడీఏ నిధులతో రెండోసారి స్తూపాన్ని నిర్మించింది.

సడలని ఆంక్షలు
అమరులైన ఆదివాసీల స్మారకార్థం స్తూపాన్ని నిర్మించారు. ఆ తర్వాత ప్రభుత్వాలు స్తూపం వద్ద సంస్మరణ దినోత్సవం నిర్వహణపై నిషేధాజ్ఞలు విధించడంతో ఎన్నో ఏళ్ల పాటు ఏప్రిల్ 20 వచ్చిందంటే అక్కడ భారీ ఎత్తున పోలీసుల బందోబస్తు కనిపించేది. 2015 నుంచి తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా అనుమతి ఇవ్వకపోయినా ఆంక్షలు సడలించింది. అయితే పోలీసు బందోబస్తు మాత్రం అదే రీతిలో కనిపిస్తుంది.

పోలీసు బందోబస్తు
స్తూపం వద్ద ఏటా మాదిరిగానే ఈ సారి కూడా గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. బుధవారం సాయంత్రమే పోలీసు బలగాలు ఇక్కడికి చేరుకున్నాయి. సుమారు 300 మందితో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు డీఎస్పీ నాగేందర్ తెలిపారు. ఆదివాసీలు శాంతియుత వాతావరణంలో నివాళులర్పించాలని ఆయన కోరారు.



క్లుప్తంగా

హత్య కేసులో నిందితుడి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ

జన్నారం: పెద్ద నాన్నను కర్రతో కొట్టి చంపిన నిందితుడిని పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సీఐ కృష్ణా రెడ్డి, ఎస్సై సతీశ్‌లు వివరాలు వెల్లడించారు. మండలంలోని మల్యాల గ్రామానికి చెందిన తడిసె పోశం(70) మరుదలు కొడుకైన దోసల్ల సుమన్‌ను పలుమార్లు మద్యం మానేసి పని చేసుకోవాలని సూచించాడు. దీంతో అతడిపై కోపం పెంచుకున్న సుమన్ మంగళవారం మద్యం మత్తులో పోశంపై కర్రతో దాడి చేసి హత్య చేశాడు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించనున్నట్లు సీఐ తెలిపారు.

కార్మిక సంఘాలను నిర్వీర్యం చేస్తున్న కేంద్రం



మాట్లాడుతున్న నాగరాజ్‌గోపాల్

మందమర్రిరూరల్: కేంద్ర ప్రభుత్వం డీపీఈ గైడ్‌లైన్స్‌ను సవరించి కార్మిక సంఘాలను నిర్వీర్యం చేస్తుందని సీఐటీయూ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ నాగరాజ్‌గోపాల్ పేర్కొన్నారు. బుధవారం ఏరియాలోని కేకే-ఓసీపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వేజ్‌బోర్డ్ సమావేశంలో మెరుగైన ఒప్పందం కోసం కార్మిక సంఘాలు ఒత్తిడి తెస్తున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం డీపీఈ గైడ్‌లైన్స్ సవరించి బొగ్గు రంగ సంస్థకు మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇందులో అసిస్టెంట్ ఫిట్ సెక్రెటరీ ఆరీఫ్, ఏరియా అధ్యక్షుడు వెంకటస్వామి, కార్యదర్శి రాజేందర్, నాయకులు ఐలయ్య, సంజీవ్, భరత్, రమేష్ ఉన్నారు.

విద్యార్థుల మార్కులు ఆన్‌లైన్ చేయాలి

మంచిర్యాలఅర్బన్: ప్రైవేట్, ప్రభుత్వ అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో ఈ నెల 23 లోగా ఒకటి నుంచి తొమ్మిదో తరగతి వరకు ఎస్‌ఏ-2 జవాబు పత్రాల మూల్యాంకనం చేసి విద్యార్థుల మార్కులను స్కూల్ ఈడీయూలో వందశాతం ఆన్‌లైన్ చేయాలని డీఈవో వెంకటేశ్వర్లు అన్నారు. పెండింగ్‌లోని ఎఫ్‌ఏ, ఎస్‌ఏ-1ల ఆన్‌లైన్ వెంటనే పూర్తి చేయాలన్నారు. పదోతరగతి విద్యార్థులందరికీ ఎఫ్‌ఏ-1,2 ఎస్‌ఏ-1 ఎఫ్‌ఏ-3,4ల వరకు మార్కులతో పాటు హాజరు శాతం కూడా నూటికి నూరుశాతం పూర్తిచేయాలని ఆదేశించారు.

రహదారి అలజడి

- హాజీపూర్ మండలం గుడిపేటవాసుల ఆందోళన
- గతంలో ఎల్లంపల్లికి.. నేడు రహదారికి..
- సర్వస్వం కోల్పోతున్నామని ఆవేదన
- వందల మందికి దూరం కానున్న స్వయం ఉపాధి
- న్యాయమైన పరిహారం కోసం పోరాటం



గుడిపేటలోని రహదారి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): జిల్లాలో రాయపట్నం వంతెన నుంచి క్యాతనపల్లి జాతీయ రహదారి వరకూ భారత్‌మాలలో భాగంగా 36 కిలో మీటర్ల మేర నూతనంగా నిర్మిస్తున్న నాలుగు వరసల జాతీయ రహదారి 63 కోసం భూసేకరణ ప్రక్రియకు త్వరలో శ్రీకారం చుట్టనున్నారు. భూ సేకరణకు ప్రభుత్వం ఇప్పటికే బహిరంగ ప్రకటన విడుదల చేసింది. దీంతో హాజీపూర్ మండలంలో అలజడి సృష్టిస్తోంది. ఇప్పటికే ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నిర్మాణంతో సర్వస్వం కోల్పోయి నిర్వాసితులుగా మారి జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న భూములు కొనుగోలు చేసి ఇండ్లు నిర్మించుకుని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎల్లంపల్లి ప్రాజెక్ట్ కోసం త్యాగధనులుగా నిలిచిన గుడిపేటవాసులు మరోసారి నాలుగు వరసల జాతీయ రహదారితో నిర్వాసితులుగా మారనుండడంతో ఆందోళన చెందుతున్నారు. నేషనల్ హైవే అథారిటీస్ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్‌ఏఐ) ఇటీవల భూసేకరణ కోసం నోటిఫికేషన్ విడుదల చేసింది. అప్పటి నుంచి న్యాయం చేయాలంటూ బాధితులు సంబంధిత కార్యాలయాల చుట్టూ తిరుగుతుండడంతో పాటు అధికారులకు, కేంద్ర, రాష్ట్ర ప్రజాప్రతినిధులకు వినతులు అందజేస్తున్నారు.

ఆర్మూర్ టూ మంచిర్యాల...

రవాణా వ్యవస్థను మరింత అభివృద్ధి చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రహదారుల నిర్మాణాలు చేపడుతున్నాయి. తాజాగా మంచిర్యాల-ఆర్మూర్ వరకు నాలుగు వరసల జాతీయ రహదారి నిర్మాణం కోసం ప్రణాళిక సిద్ధం చేసింది. ఇందుకు మార్చి 28న జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ భూసేకరణ నోటిఫికేషన్ విడుదల చేసింది. జిల్లాలో ఈ రోడ్డు రాయపట్నం వంతెన నుంచి గూడెం, లక్సెట్టిపేట, హాజీపూర్‌ల మీదుగా క్యాతనపల్లి వరకూ మొత్తం 36 కిలో మీటర్ల రోడ్డు నిర్మాణం జరగనుంది. ఏ సర్వే నంబర్‌లో ఎంత భూమి సేకరణ జరుగుందనే ప్రకటన చేస్తూ రోడ్డు నిర్మాణంపై ఎన్‌హెచ్‌ఏఐ మ్యాప్ విడుదల చేసింది. మిషన్ భగీరథ పైప్‌లైన్ కారణంగా భూ సేకరణ ప్రణాళిక



గుడిపేటలో కోల్పోతున్న ఇళ్లు

మార్చినట్లు తెలుస్తోంది. ఒక్కో దగ్గర ఒక్కవైపే వంద ఫీట్ల వరకు భూ సేకరణ చేస్తున్నట్లు మ్యాప్‌లో పొందుపరిచారు. ఆర్ అండ్ బీ నిబంధనల మేరకు రోడ్డుకు 75ఫీట్ల దూరంలో కట్టుకున్నప్పటికీ ఇప్పుడు రోడ్డు ఏర్పాటులో ఇళ్లన్నీ పూర్తిగా కోల్పోతుండడంతో బాధితుల గోస అంతాఇంతా కాదు.

న్యాయం చేయాలి



ఇప్పటికే ఎల్లంపల్లి ప్రాజెక్ట్‌తో సర్వస్వం కోల్పోయాం. ఇప్పుడు జాతీయ రహదారి నిర్మాణంతో మరోసారి నిర్వాసితులవుతున్నాం. రోడ్డు పక్కన ఇండ్లు కట్టుకుని ఉపాధి కోసం దుకాణాలు పెట్టుకున్నాం. రోడ్డు వెడల్పుతో భూ సేకరణ అంటున్నారు. మిషన్ భగీరథ పైప్‌లైన్, రియల్టర్ల ముడుపులతో రోడ్డు మ్యాప్ మార్చారు. సమ న్యాయం జరిగేలా చూడాలి.

– చిలుకూరి ఆనందచారి, గుడిపేట

న్యాయపోరాటానికి సిద్ధం..

జాతీయ రహదారి 63 నాలుగు వరసల రోడ్డు నిర్మాణానికి ఎన్‌హెచ్‌ఏఐ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఎన్‌హెచ్ 63 బాధితుల సంఘంగా ఏర్పాటై మా భూములు ఇచ్చేది లేదని, ఎంతటి న్యాయ పోరాటానికైనా సిద్ధమంటున్నారు. రియల్ వ్యాపారుల ముడుపులకు తలొగ్గి మ్యాప్ మార్చడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. గతంలో విడుదల చేసిన మ్యాప్‌ను రియల్ వ్యాపారులు రూ.కోట్లలో ముట్టజెప్పడం వలనే మార్చారని ఆరోపిస్తున్నారు. ఇప్పటికే మంత్రులకు, కలెక్టర్, ఎన్‌హెచ్‌ఏఐ, ఆర్డీఓకు వినతిపత్రాలు అందించారు.

ఎల్లంపల్లి ప్రాజెక్ట్‌లో...

ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నిర్మాణం కోసం హాజీపూర్ మండలంలోని గుడిపేట, నంనూర్ గ్రామాల ప్రజలు విలువైన పంట భూములు, ఇళ్లను కోల్పోయి త్యాగధనులుగా నిలిచారు. అప్పుడు ప్రభుత్వం ఇచ్చిన పరిహారంతో కొంత మంది గుడిపేట జాతీయ రహదారిని ఆనుకుని భూములు కొనుగోలు చేసి ఇళ్ల నిర్మాణం చేసుకోవడమే కాదు మరికొంత మంది ఉపాధి కోసం వ్యాపార సముదాయాలు ఏర్పాటు చేసుకున్నారు. అయితే జాతీయ రహదారి నిర్మాణ ప్రకటన ఆ కుటుంబాల్లో పిడుగు పడినట్లయింది.

సింగరేణి క్వార్టర్‌లో పల్లె దవాఖాన



క్వార్టర్‌లో ఏర్పాటు చేసిన పల్లె దవాఖానా

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని మూడో జోన్‌లోని క్వార్టర్‌లో ప్రభుత్వ పల్లె దవాఖానా ఏర్పాటు చేశారు. మూడో జోన్‌లో కాలీగా ఉన్న క్వార్టర్‌లో సింగరేణి అధికారులకు సమాచారం లేకుండా పల్లె దావాఖానా ఏర్పాటు చేశారు. ఓ ఉద్యోగి వేరే ఏరియాకు బదిలీ కావడంతో అక్కడ అతడికి ఆ ఏరియాలో వేరే క్వార్టర్ ఇచ్చినట్లు సమాచారం. పల్లె దావాఖానా ఏర్పాటు చేసిన క్వార్టర్ వేరే ఏరియాకు వెళ్లిన కార్మికుడు ఎందుకు సింగరేణికి అప్పగించలేదని... సింగరేణికి అప్పగించకుండానే మరో క్వార్టర్ సదరు కార్మికుడికి ఎందుకు కేటాయించారనే ప్రశ్నలు తలెత్తున్నాయి.

వడదెబ్బతో వృద్ధుడు మృతి



కొప్పర్తి చిన రాజం(ఫైల్)

నస్పూర్: పట్టణ పరిధిలోని అంబేద్కర్ కాలనీకి చెందిన కొప్పర్తి చిన రాజం(60) వడదెబ్బతో మృతిచెందాడు. ఓ బిల్డింగ్ వద్ద వాచ్‌మెన్‌గా విధులు నిర్వర్తిస్తుంటాడు. మంగళవారం విధులకు వెళ్లి సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చి నిద్రించాడు. బుధవారం ఉదయం తీవ్ర అస్వస్థతకు గురై వడదెబ్బతో మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

హామీలు నెరవేర్చడంలో ప్రభుత్వాలు విఫలం

తాండూర్: ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేణ శంకర్, జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జి రేగుంట చంద్రశేఖర్ విమర్శించారు. సీపీఐ ఆధ్వర్యంలో అసెంబ్లీ నియోజకవర్గ సమగ్రాభివృద్ధి, బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా బెల్లంపల్లి నియోజకవర్గంలో చేపట్టిన ప్రజా పోరు యాత్ర బుధవారం రెండో రోజు మండలంలోని బోయపల్లి, చౌటపల్లి, పోచంపల్లి, కిష్టంపేట గ్రామాల్లో సాగింది. బోయపల్లి వద్ద చంద్రశేఖర్‌కు నాయకులు పూలమాల వేసి యాత్రను ప్రారంభించారు. అసెంబ్లీ నియోజకవర్గ కార్యదర్శి చంద్రశేఖర్, సీపీఐ ముఖ్య నాయకులు దాగం మల్లేష్, సాలిగామ సంతోష్, బొంతల లక్ష్మీనారాయణ, అందే పురుషోత్తం యాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల కనీస మౌలిక



మాట్లాడుతున్న శంకర్

సమస్యల పరిష్కారంలోనూ శ్రద్ధ చూపలేదని విమర్శించారు. నియోజకవర్గ ప్రజలకు గోదారి జలాలు అందించాలని, పోడు భూముల పట్టాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రజా నాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి పల్లె నర్సింహ, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మామిడాల రాజేశం, నాయకులు జీసీ మాణిక్యం, బియ్యాల ఉపేందర్, అక్కెపల్లి బాపు, దాడి గట్టయ్య, ప్రహ్లాద్, కామెర మల్లయ్య, రత్నం రాజం, భరత్ పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఆర్‌సీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా రఘునాథ్



నియామక పత్రం అందుకుంటున్న రఘునాథ్

జైపూర్: జాతీయ మానవ హక్కుల కమిటీ(ఎన్‌హెచ్‌ఆర్‌సీ) జాతీయ చైర్మన్ డాక్టర్ మహ్మద్ యాసీన్ ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధిగా మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం మిట్టపల్లి గ్రామవాసి, ఆర్టీఐ ఆక్టివిస్ట్ దుర్గం రఘునాథ్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లో రాష్ట్ర అధ్యక్షులు మొగుళ్ల భద్రయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాటి శ్రీకాంత్‌రెడ్డి, ఉపాధ్యక్షులు సుంకనపెల్లి రాము, మీదింటి శివవీర్‌రెడ్డి, ఆరె శ్రీనివాస్ సమక్షంలో నియామక పత్రాన్ని అందుకున్నట్లుగా తెలిపారు.

అన్ని దానాల్లో రక్తదానం గొప్పది..

లక్సెట్టిపేట: అన్ని దానాలలోకెల్లా రక్తదానం చాలా గొప్పదని జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ అన్నారు. బుధవారం మార్కెట్‌యార్డ్ ఆవరణంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, రెవెన్యూ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి ఒక్కరూ రక్తదానం అలవాటు చేసుకోవాలని తెలిపారు. అనంతరం రక్తదాతలను అభినందించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జ్యోత్స్న, ఎంపీడీవో నాగేశ్వర్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

తాగడానికి డబ్బులు ఇవ్వలేదని దాడి

బెల్లంపల్లి: మద్యం తాగడానికి డబ్బులు ఇవ్వకపోవడంతో దాడిచేసిన సంఘటన బుధవారం వెలుగు చూసింది. వన్‌టౌన్ ఏఎస్సై రంగు తిరుపతి వివరాల ప్రకారం... బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధి కన్నాలబస్తీ మధునన్న నగర్‌కు చెందిన పళని స్వామి అదే బస్తీకి చెందిన బామండ్లపల్లి జలపతి అనే మద్యం ప్రియుడు ఈనెల 11న రూ.500లు అప్పు అడిగాడు. తనవద్ద డబ్బులు లేవని చెప్పడంతో స్వామిపై కక్ష పెంచుకున్నాడు. జలపతి ఈ నెల 13వ తేదీన రాత్రి పారను తీసుకుని వెళ్లి ఇంట్లో నిద్రిస్తున్న స్వామిపై దాడి చేశాడు. గాయపడిన స్వామిని కుటుంబీకులు స్థానిక ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

ఓసీని సందర్శించిన ఆడిట్ కమిటీ



తనిఖీలో పాల్గొన్న అధికారులు

రామకృష్ణాపూర్: మందమర్రి ఏరియాలోని ఆర్‌కేపీ ఓపెన్‌కాస్ట్ గని పరిసర ప్రాంతాలను మాన్‌సూన్ ఆడిట్ కమిటీ సభ్యులు బుధవారం పరిశీలించారు. పంపింగ్ స్టేషన్, సీజనల్ నాలా, సెట్లింగ్ పాండ్స్, రోడ్ సైడ్ కల్వర్టులను పరిశీలించి వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏరియా సేఫ్టీ ఆఫీసర్ వెంకటరమణ, సర్వే ఆఫీసర్ జైనులాబుద్దీన్, ఎస్ఈ సివిల్ పద్మరాజు, ప్రాజెక్ట్ ఆఫీసర్ మధుసూదన్ పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుడిపై కౌన్సిలర్ భర్త తిట్ల దండకం

- తీవ్ర పదజాలంతో దుర్భాషలు
- మున్సిపల్ చైర్‌పర్సన్‌పైనా నోరు జారిన వైనం
- చర్యలు తీసుకోవాలని కార్మికుల ఆందోళన

బెల్లంపల్లి: పట్టణంలోని 27వ వార్డు కౌన్సిలర్ తడక పద్మావతి భర్త రవికుమార్ మెయింటనెన్స్ కార్మికుడిని తీవ్ర పదజాలంతో దూషించడం చర్చనీయాంశంగా మారింది. ఆడియో రికార్డు హాట్ టాపిక్‌గా మారి వాట్సాప్‌ల్లో చక్కర్లు కొడుతోంది. బాధిత కాంట్రాక్టు కార్మికుడి కథనం ప్రకారం.. ఎల్ఈడీ లైట్ల మరమ్మతు కోసం ఈ నెల 17న రవికుమార్ మెయింటనెన్స్ కాంట్రాక్టు కార్మికుడు మీనుగు అనుదీప్ సెల్‌కు ఫోన్ చేశాడు. ఉన్నఫలంగా లైట్లు మరమ్మతు చేయాలని ఒత్తిడి తేగా.. వార్డుల వారీగా రిపోర్టులు చాలా ఉన్నాయని, వారం రోజులు పడుతుందని చెప్పడంతో తిట్ల దండకం మొదలుపెట్టాడు. కనీస విచక్షణ కోల్పోయి తీవ్ర పదజాలంతో దూషించాడు. ఆ తర్వాత రవికుమార్ మరో కార్మికుడికి ఫోన్ చేసి ఆ పిల్లగాడు ఎక్కడోడు అంటూ బూతులు మాట్లాడాడు. అసహనం వ్యక్తం చేస్తూనే మున్సిపల్ చైర్‌పర్సన్‌పైనా నోరుజారాడు. దుర్భాషలాడిన ఆడియో రికార్డు బెల్లంపల్లిలో వైరల్ అవుతోంది. కౌన్సిలర్ భర్త దుర్భాషలాడిన విషయమై సదరు కాంట్రాక్టు కార్మికుడు చైర్‌పర్సన్ శ్వేతకు ఫోన్ చేసి చెప్పగా.. తానేమీ చేయలేనని, ముందు వెళ్లి వాళ్ల వార్డులో పని చేయాలని, రెండు నెలల వేతనాలు ఇప్పించాను కదా అంటూ ఓదార్పు మాటలతో సర్దిచెప్పడం కొసమెరుపు.

ట్యాంకెక్కి ఆందోళన

రవికుమార్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఎల్ఈడీ మెయింటనెన్స్ కాంట్రాక్టు కార్మికులు అనుదీప్, మధు ఏఎంసీ ఏరియా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం పక్కన ఉన్న మిషన్ భగీరథ వాటర్ ట్యాంకెక్కి ఆందోళన చేశారు. వన్‌టౌన్ ఎస్‌హెచ్ఓ శంకరయ్య వచ్చి సామరస్యంగా సమస్య పరిష్కరించుకోవాలని సూచించారు. అంతలోనే ఆకస్మికంగా తేనే టీగలు దాడి చేయడంతో కార్మికులు కిందికి దిగి చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రికి వెళ్లారు. కాగా, కౌన్సిలర్ భర్త రవికుమార్ స్పందిస్తూ కాంట్రాక్టు కార్మికుడు ఫోన్ చేసి గంట వ్యవధిలో వస్తానని రాకపోవడం, వారం రోజులు సమయం పడుతుందని చెప్పడంతో క్షణికావేశంలో అన్నానని తెలిపాడు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ

లక్సెట్టిపేట: రంగారెడ్డి జిల్లా న్యాయవాది రవికాంత్ రెడ్డిపై దాడిని నిరసిస్తూ లక్సెట్టిపేట బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం న్యాయవాదులు విధులను బహిష్కరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కారుకూరి సురేందర్ మాట్లాడుతూ న్యాయవాదులపై రోజు రోజుకు దాడులు పెరుగుతున్నాయని, దాడులకు పాల్పడిన వ్యక్తులను ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రధాన కార్యదర్శి నేరేళ్ల రాజేశ్వర్, ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి ఇంట్లో చోరీ

చెన్నూర్: చెన్నూర్ పట్టణంలోని లైన్‌గడ్డ కాలనీలో గుర్తు తెలియని వ్యక్తులో ఇంట్లోకి చొరబడి బీరువాలోని కిలో వెండి, ల్యాప్‌టాప్, రూ.4వేల నగదును ఎత్తుకెళ్లినట్లు ప్రభుత్వ ఉపాధ్యాయుడు వారణాసి నరేందర్ తెలిపారు. అతడి వివరాల ప్రకారం .. ఆదివారం పని నిమిత్తం హైదరాబాద్ వెళ్లాడు. మంగళవారం రాత్రి ఇంటికి వచ్చి చూడగా ఇంటి ప్రధాన ద్వారం గడియ తొలగించి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా దొంగతనం జరిగినట్లు గుర్తించి అదే రాత్రి 100 సమాచారం ఇచ్చాడు. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

'ప్రశ్నించే తత్వం కోల్పోయిన జాతీయ సంఘాలు'

పాతమంచిర్యాల: కార్మికుల సమస్యలపై వేజ్‌బోర్డు సమావేశాల్లో జాతీయ కార్మిక సంఘాలు ప్రశ్నించే తత్వాన్ని కోల్పోవడంతో కార్మికులకు తీరని అన్యాయం జరిగిందని సింగరేణి ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవిసత్యం, రాష్ట్ర కో కన్వీనర్ నీరటి రాజయ్య విమర్శించారు. బుధవారం మంచిర్యాలలో విలేకరులతో మాట్లాడారు. జాతీయ కార్మిక సంఘాల వైఫల్యం వల్ల 11వ వేజ్ బోర్డు అమలు జాప్యం జరుగుతోందని తెలిపారు. జేబీసీసీఐ సమావేశాల్లో ఏం మాట్లాడాలో తెలియకుండానే వెళ్లారా అని ప్రశ్నించారు. చర్చల్లో హెచ్ఎంఎస్, ఐఎన్టీయూసీ కార్మికుల అలవెన్స్‌ల పెరుగుల విషయంలో కార్మికులకు అన్యాయం జరుగుతోందని యాజమాన్యంతో వాదించగా.. బీఎంఎస్, ఏఐటీయూసీ, సీఐటీయూ తమ ఆర్థిక ప్రయో



మాట్లాడుతున్న రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవిసత్యం, రాష్ట్ర కో కన్వీనర్ నీరటి రాజయ్య

జనాల కోసం మాట్లాడకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి బొగ్గుగని కార్మికుల 11వ వేతన సవరణ సమస్యను పరిష్కరించాలని అన్నారు. సింగరేణి ఉద్యోగుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

కేంద్రీయ నర్సరీ సందర్శన

భీమారం: మండల కేంద్రం భీమారం సమీపంలో అటవీశాఖ ఏర్పాటు చేసిన కేంద్రీయ మొక్కలనర్సరీని సీసీఎఫ్(కంపా)లోకేష్‌జైస్వాల్ బుధవారం సందర్శించారు. వివిధ రకాల మొక్కల వివరాలపై స్థానిక అటవీశాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. కంపా నిధుల ద్వారా చేపట్టిన వివిధ పనులపై ప్రశ్నించారు. రానున్న వర్షాకాలంలో పంపిణీ చేసేందుకు ఐదు లక్షల మొక్కలు సిద్ధం చేస్తున్నామని ఫారెస్ట్ సెక్షన్ అధికారి రామకృష్ణ వివరించారు. సీసీఎఫ్ లోకేష్ జైస్వాల్ మాట్లాడుతూ పచ్చదనం పెంపొందించేందుకు కంపా ద్వారా పెద్ద ఎత్తున మొక్కలు పెంపకానికి నిధులు మంజూరు చేస్తున్నామని తెలిపారు. చీఫ్ కన్జర్వేటర్ వినోద్‌కుమార్, మంచిర్యాల డీఎఫ్ఓ ఆశిష్‌సింగ్, ఎఫ్‌డీవో వినయ్‌కుమార్ సాహు ఉన్నారు.

ఆత్మీయ సభ ఏర్పాట్ల పరిశీలన

చెన్నూర్: చెన్నూర్ పట్టణంలోని ఎంఆర్ఆర్ గార్డెన్‌లో గురువారం కోటపల్లి మండలం, శుక్రవారం చెన్నూర్ మున్సిపాలిటీలకు చెందిన బీఆర్ఎస్ నాయకుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నారు. ఏర్పాట్లను ప్రభుత్వ విప్ బాల్క సుమన్ బుధవారం పరిశీలించారు. ఆత్మీయ సమ్మేళనానికి హాజరయ్యే బీఆర్ఎస్ కుటుంబ సభ్యులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని చర్యలు చేపట్టాలని సూచించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లెల దామోదర్‌రెడ్డి, రత్న సమ్మిరెడ్డి, మండల వైస్ ప్రెసిడెంట్ వెన్నపురెడ్డి బాపురెడ్డి, సమ్మిరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు రాంలాల్‌గిల్డా, నాయిని సతీశ్ తదితరులు పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్

ఎస్టీపీపీలో యోగా, ధ్యాన మహోత్సవం

జైపూర్: మండల కేంద్రంలోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటులో శ్రీరామచంద్రమిషన్ ఆధ్వర్యంలో బుధవారం యోగ, ధ్యాన మహోత్సవం నిర్వహించారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా శ్రీరామచంద్రమిషన్, హార్ట్‌ఫుల్‌నెస్ ద్వారా «హర్ దిల్ ధ్యాన్, హర్ దిన్ ధ్యాన్» కార్యక్రమాలు దేశ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎస్టీపీపీ జీఎం సూర్యనారాయణరాజు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. హార్ట్‌ఫుల్‌నెస్ ప్రిసిప్టర్ సత్యం మాట్లాడుతూ యోగా, ధ్యానం వలన అపారమైన ప్రయోజనాలు ఉన్నాయని తెలిపారు. రెండ్రోజులపాటు ఎస్టీపీపీలో కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఎం రామశాస్త్రి, యోగా శిక్షకులు విశ్వం, పద్మావతి, పవన్, ప్రవీణ్‌శర్మ, నరేశ్, వెంకటేశ్, కల్పన పాల్గొన్నారు.

విద్యుత్ తీగలకు రెండు ఎడ్లు బలి


నెన్నెల: మండలంలోని చిత్తపూర్ గ్రామ శివారులో వన్యప్రాణుల వేట కోసం అమర్చిన విద్యుత్ తీగలు తగలి మంగళవారం రాత్రి రెండు ఎడ్లు మృతిచెందగా ఒక వ్యక్తి ప్రాణపాయం నుంచి బయటపడ్డాడు. చిత్తపూర్‌కు చెందిన పల్లకిష్టయ్యకు చెందిన ఎడ్ల బండిపై అడవికి వెళ్లాడు. వేటగాళ్లు వన్య ప్రాణుల కోసం అమర్చిన విద్యుత్ తీగను గమనించకుండా వెళ్లడంతో ఎడ్ల కాళ్లకు విద్యుత్ తీగలు తగలడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాయి. బండిపై నుంచి కిష్టయ్య కిందకు దూకి ప్రాణాలను దక్కించుకున్నాడు. విషయం బయటకు రాకుండా బాధిత రైతుతో ఒప్పందం చేసుకోవడంతో ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

డిగ్రీ 2, 4, 6వ సెమిస్టర్ల పరీక్షల ఫీజు గడువు

కేయూక్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఆదిలాబాద్, ఖమ్మం జిల్లాల్లో డిగ్రీ కోర్సుల రెండో, నాలుగో, ఆరో సెమిస్టర్ పరీక్షల ఫీజు చెల్లించేందుకు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా ఈ నెల 25వరకు గడువు ఉందని పరీక్షల నియంత్రణాధికారి మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారులు జి.మధుకర్, డాక్టర్ ఎ.నరేందర్ తెలిపారు. రూ.50 అపరాధ రుసుంతో 28 వరకు గడువు ఉందని పేర్కొన్నారు. వివరాలు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.

'దళారులను అరికట్టేందుకే కొనుగోలు కేంద్రాలు'

మంచిర్యాలరూరల్(హాజీపూర్): గ్రామాల్లో దళారులను అరికట్టేందుకు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ బాదావత్ సంతోష్, ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. బుధవారం పడ్తనపల్లిలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ సంతోష్, ఎమ్మెల్యే దివాకర్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 244 కేంద్రాలు ఏర్పాటు చేసి 2.28 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించనున్నట్లు తెలిపారు. కేంద్రంలో ఏర్పాటు చేసిన భోజన వసతిలో స్వయంగా రైతులకు భోజనం వడ్డించారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ తిప్పని లింగయ్య, ఎంపీపీ మందపల్లి స్వర్ణలత, వైస్ ఎంపీపీ బేతు రమాదేవి, సర్పంచ్ గోళ్ల శ్రీనివాస్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ప్రేమ్‌కుమార్, జిల్లా సహకార అధికారి కృష్ణ, తహసీల్దార్ రాజలింగు, తదితరులు పాల్గొన్నారు. కర్ణమామిడిలోనూ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు.



పడ్తనపల్లిలో కొనుగోలు కేంద్రంలో తూకం వేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

కుట్టు శిక్షణతో మహిళలకు జీవనోపాధి

లక్సెట్టిపేట: మహిళలకు కుట్టు శిక్షణ జీవనోపాధిగా ఉంటుందని డీఆర్‌డీవో శేషాద్రి అన్నారు. మండలంలోని చందారం గ్రామంలో ఏర్పాటు చేసిన అక్షర వాలంటీర్‌లకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. నిరక్ష్యరాసులు, అక్షర వాలంటీర్లకు సులభమైన పద్ధతిలో అక్షరాలు నేర్పే విధానాన్ని తెలిపారు. జిల్లా వయోజన విద్యాశాఖ, డీఆర్‌పీలు వయోజన విద్యపై గ్రామాల్లో బలోపేతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వయోజన విద్య జిల్లా ఇంచార్జి పురుషోత్తంనాయక్, ఆసిఫాబాద్ జిల్లా ఇంచార్జి రమేష్‌రెడ్డి, డీఆర్‌పీలు సుందిల్ల రమేష్, కందుల తిరుపతి, అశోక్‌రావు పాల్గొన్నారు.